సాక్షి
విశాఖపట్నం
శనివారం, 9, డిసెంబర్, 2023



కళాకారులకు పురస్కారాలు

సాయినాథ కళాసమితి కళాకారులకు పలు అంశాల్లో పురస్కారాలు లభించినట్టు అరుణసాయికుమార్ తెలిపారు. 8లో



జలాంతర్గామి దినోత్సవం

భారత నావికాదళం జలాంతర్గామి విభాగం ఏర్పడిన సందర్భంగా సబ్‌మెరైన్ డే ఘనంగా నిర్వహించారు. 8లో

సత్తాచాటిన విపిన్



ఐరన్‌మ్యాన్ మ్యాచ్ చాంపియన్‌షిప్‌లో భారత నావికాదళానికి చెందిన ఫైలట్ విపిన్ పియోరాన్ సత్తాచాటాడు. 8లో

సాగరతీరం.. సంభ్రమాశ్చర్యం..!



సంద్రంలో బాంబుల మోత





- నేవీ విన్యాసాలు అదుర్స్
- ఆకట్టుకున్న ఫైనల్ రిహార్సల్
- రెప్పవాల్చకుండా చూసిన సందర్శకులు



నేవీ బ్యాండ్ ప్రదర్శన



ఆపద సంకేతం



విన్యాసాలు వీక్షిస్తూ...



సాక్షి, విశాఖపట్నం : సాగర జలాల్లో యుద్ధ నౌకల కవాతు.. గగన తలంలో హెలికాప్టర్ల పహారా.. శత్రు మూకలపై నేవీ కమాండోల కదన దూకుడు.. రివ్వున దూసుకొచ్చిన మిసైల్స్.. దానితో పోటీ పడేటట్లుగా మెరుపు వేగంతో వెళ్లిన యుద్ధ విమానాలు.. గాల్లో చక్కర్లు కొట్టిన హెలికాప్టర్లు.. మొత్తంగా.. ఆర్‌కే బీచ్.. రణరంగాన్ని తలపించింది. ఒళ్లు గగుర్పొడిచేలా నిర్వహించిన నేవీ విన్యాసాలా రిహార్సల్.. యుద్ధ వాతావరణాన్ని మించిపోయేలా చేసింది. ఉవ్వెత్తున ఎగిసిపడిన జనసంద్రం నడుమ ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని.. నింపిన నౌకాదళ విన్యాసాలలో సాగర తీరం సంభ్రమాశ్చర్యాలకు కేంద్రంగా మారింది. శుక్రవారం నిర్వహించిన తుది రిహార్సల్స్.. గంటన్నర సేపు అలరించాయి. అంతకు ముందు నేవీ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నేవీ బ్యాండ్‌తో సైలర్స్ అదరగొట్టారు. ఆర్‌కే బీచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన నేవీ తాత్కాలిక కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు విన్యాసాలను పర్యవేక్షించారు. 10న జరిగే నేవీడేకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, హాజరుకానున్నారు.

న్యూస్‌రీల్

రేపు గవర్నర్ రాక



మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం విశాఖ వస్తున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గన్నవరం నుంచి విమానంలో విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి నేరుగా విశాఖ పోర్టు గెస్టు హౌస్‌కు చేరుకొని కొద్ది సేపు విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 4.07 గంటలకు పోర్టు గెస్టు హౌస్ నుంచి ఆర్‌కే బీచ్‌కు బయలుదేరుతారు. సాయంత్రం 4.12 గంటల నుంచి 5.35 గంటలకు వరకు ఆర్.కె.బీచ్‌లో జరిగే నేవీ డేలో పాల్గొంటారు. 5.35 గంటలకు ఆర్.కె.బీచ్ నుంచి బయలుదేరి నేవీ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ కొద్ది సేపు ఉండి హై టీ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి విమానాశ్రయానికి బయలు దేరుతారు. రాత్రి 7.30 గంటలకు ఐఎన్ఎస్ డేగా నుంచి విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

విశాఖ మ్యూజియం ప్రవేశం ఉచితం

దాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ప్రతి నెలా రెండో శనివారం విద్యార్థులకు విశాఖ మ్యూజియం ప్రవేశం ఉచితమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. నేవీ డే సందర్భంగా బీచ్‌రోడ్డులో నిర్వహిస్తున్న రిహార్సల్స్ మేయర్ వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ మ్యూజియాన్ని విద్యార్థులంతా తప్పక తిలకించాలన్నారు. విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు.

జేసీఎస్ కో ఆర్డినేటర్లుగా కిరణ్, పూర్ణందశర్మ

దొండపర్తి: విశాఖ జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్లుగా నాగిరెడ్డి కిరణ్, గున్నంటి పూర్ణందశర్మ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయ ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరిని నియమించినట్లు పేర్కొంది.

లా వర్సిటీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ, ఎల్ఎల్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లా, ఇంటర్ డిసిప్లినరీ (సోషల్ సైన్స్, నేచురల్ సైన్స్) విభాగాల్లో రెగ్యులర్, పార్ట్ టైం, ఎగ్జిక్యూటివ్ విధానంలో ప్రవేశాలకు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హతలు, ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.dsnlu.ac.in ను పరిశీలించాలని తెలియజేశారు.

10న అంబేడ్కర్ వర్సిటీ తరగతులు

విశాఖ విద్య: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ రెండో సంవత్సరం బీఏ/ బీకాం/ బీఎస్సీ తరగతులు ఈ నెల 10న జరుగుతాయని అధ్యయన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ బి. రాజు కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ నగరంలోని డాక్టర్ వీఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటాయన్నారు. కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

నేడు శ్రీవారి లడ్డూ విక్రయాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం లడ్డూ విక్రయాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. 750 గ్రాములు ఉన్న కల్యాణ లడ్డు రూ. 200, 140 నుంచి 170 గ్రాములు బరువు ఉన్న సాధారణ లడ్డు రూ. 50 విక్రయించనున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి శ్రీవారి సన్నిధిలో విక్రయాలు జరపనున్నామన్నారు.



కొండంత పండగ

విశాఖలోని పాతపోస్టాఫీస్ ప్రాంతంలోని రోస్‌హిల్ కొండపై వెలసిన అమలోద్భవిని దర్శించుకోవడానికి అశేష భక్తజనం తరలివచ్చింది. శుక్రవారం కనువిందుగా కొండగుడి పండుగ నిర్వహించారు. భక్తి పారవశ్యంతో మాతను స్తుతిస్తూ..ఆరాధకుల గీతాలాపనలు..సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం అగ్ర పీఠాధిపతుల బోధనలు, ఇలా అణువణువునా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణ జిల్లాల నుంచి అమ్మ కరుణ కోసం తరలి వచ్చిన ఆరాధకులతో కొండగుడి విశాఖ జనపురిగా మారిపోయింది.
-డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ)

8లో



పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించాలి

దొండపర్తి: రాష్ట్రంలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించాలని హోటల్ అసోసియేషన్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చాంబర్స్ ప్రతినిధులు మంత్రిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. విశాఖ పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. దేశంలోని 12 రాష్ట్రాలలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆయా రాష్ట్రాలలో ఈ పాలసీ ఏ విధంగా అమలు జరుగుతుందో తెలుసుకొని వివరాలు అందించాలని సూచించారు. అలాగే విశాఖలో పర్యాటక రంగం చాలా వరకు దెబ్బతిందని, పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిందని వారు మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన భూమి ఇవ్వాలని రెవెన్యూ శాఖను కోరామని చెప్పారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో అమలు జరుగుతున్న లిక్కర్ పాలసీ లైసెన్స్ ఫీజు తగ్గించాలని ప్రతినిధులు కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు ఇచ్చిన సమాచారాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి దష్టికి తీసుకువెళ్లి, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు

గుర్తింపు కార్డు ఉంటేనే హార్బర్‌లోకి అనుమతి

- ఫిషింగ్ హార్బర్‌లో మరింత నిఘా
- అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు
- ప్రభుత్వ శాఖల సమన్వయ కమిటీలో కీలక నిర్ణయాలు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో నో స్మోకింగ్, నో ఆల్కహాల్ జోన్‌గా ప్రకటించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం హార్బర్‌లో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ షేక్ లాల్ మహ్మద్, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశంలో పలు కీలక విషయాలపై చర్చించారు. హార్బర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం వంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా త్వరలో పోర్టు, అగ్నిమాపక, పోలీస్, జీవీఎంసీ, మత్స్యశాఖ, వివిధ మత్స్యకార సంఘాల నాయకులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హార్బర్‌లో గుర్తింపు కార్డులుంటేనే అనుమతించనున్నారు. త్వరలోనే మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. అంతేకాకుండా అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. హార్బర్‌లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఏసీపీ మోసెస్ పాల్, జీవీఎంసీ జోన్–4 కమిషనర్ శివ ప్రసాద్, మత్స్యశాఖ ఏడీ విజయకృష్ణ, ఎఫ్‌డీవో డి.మురళీ, వివిధ మత్స్యకార సంఘాల నాయకులు వీర్రాజు, సత్తిబాబు, బర్రి కొండబాబు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ షేక్ లాల్ మహ్మద్, చిత్రంలో డీసీపీ-2 ఆనందరెడ్డి

‘ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు’

మహారాణిపేట: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ముందస్తు ప్రణాళికాయుత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఆయా కంపెనీల పరిధిలో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ మాక్‌డ్రిల్ తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. సేఫ్టీ కమిటీలను నియమించుకోవాలన్నారు. అత్యవసర సమయంలో తక్షణమే స్పందించే విధంగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఆయా కంపెనీల్లో చేపడుతున్న భద్రతా చర్యలు, మాక్‌డ్రిల్స్‌కు సంబంధించిన నివేదికలు సమర్పించాలన్నారు. ప్రమాదాల సమయంలో అప్రమత్తం చేసేలా ఆటోమేటిక్ మెకానిజం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వైద్య బృందాలను నిత్యం అందుబాటులో ఉంచుకోవాలని, సమీప ఆస్పత్రితో అనుసంధానమై ఉండాలని జేసీ చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

21న రాష్ట్ర స్థాయి మాక్‌డ్రిల్స్

రాష్ట్ర స్థాయిలో వివిధ కంపెనీల పరిధిలో ఈ నెల 21న నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీలో మాక్ డ్రిల్స్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని కంపెనీలు భాగస్వామ్యం కావాలని జేసీ కోరారు. జిల్లాలో గుర్తించిన ఆంధ్రా పెట్రో కెమికల్, కేంటెక్ కంపెనీల పరిధిలో జిల్లా స్థాయి మాక్ డ్రిల్స్ జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వి.సురేష్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విజయవంతంగా గ్లూకోస్ ఐ స్టెంట్ శస్త్ర చికిత్స

సింహాచలం: నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో గ్లకోమా నివారణకు తొలిసారిగా గ్లూకోస్ ఐ స్టెంట్ అనే పరికరాన్ని కంటిలో అమర్చి అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్టు ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు శుక్రవారం తెలిపారు. గ్లూకోస్ ఐ స్టెంట్ పరికరం అమెరికా ఎఫ్‌డీఏ ద్వారా 2012లో అనుమతిపొందిందని, ఆ తర్వాత ఆ పరికరాన్ని ఆధునికీకరించి 2018లో వినియోగంలోకి తీసుకువచ్చారన్నారు. ఈఏడాది నవంబర్‌లో ఈ పరికరాన్ని భారత్ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ఈ శస్త్ర చికిత్స నిర్వహించడం ద్వారా గ్లకోమా రోగుల్లో కంటి లోపల ఒత్తిడిని గణనీయంగా తగ్గించి, గ్లకోమా వ్యాధిని అదుపులోకి ఉంచడానికి దోహదపడుతుందన్నారు.

నాట్య కళాకారులకు పురస్కారాలు

మద్దిపాలెం: మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈ నెల 5న జరిగిన మలేషియా దీపావళి సాంస్కృతిక ధ్యాన ఉత్సవాల్లో పాల్గొన్న సాయినాథ కళాసమితి కళాకారులకు పలు అంశాల్లో పురస్కారాలు లభించినట్టు కళాసమితి నిర్వాహకుడు గురునాట్యాచార్య అరుణసాయికుమార్ తెలిపారు. లక్ష్మీస్తుతి, కృష్ణస్తుతి, రాజకీర్తనం, తరంగం వంటి అంశాల్లో తమ శిష్యులు బబూరతీయ సంస్కృతి ఉట్టిపడేలా కూచిపూడి కళా విశిష్టతను ప్రదర్శించారన్నారు. ఈ ఉత్సవాల్లో సావిత్రిరెడ్డి, సాన్వీహృతిక, జ్ఞానచార్వి, లాస్యప్రియ, భవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారన్నారు.

సత్తాచాటిన విపిన్

విశాఖ స్పోర్ట్స్ : ఐరన్‌మ్యాచ్ చాంపియన్‌షిప్‌లో భారత నావికాదళానికి చెందిన పైలట్ విపిన్ షియోరాన్ సత్తాచాటాడు. ఆస్ట్రేలియాలోని బస్సెల్టన్‌లో జరిగిన ఈ పోటీల్లో మెన్ కాటగిరిలో 18-24 వయస్సు నుంచి 70-74ఏళ్ల కేటగిరీ వరకు పలు ఏజ్ గ్రూప్‌ల్లో పోటీలు జరిగాయి. ప్రపంచంలోనే అత్యంత కష్టతరంగా పరిగణించే ఈ ట్రయాథ్లాన్‌లో మొత్తంగా 1400మంది గ్లోబల్ అథ్లెట్లు పాల్గొన్నగా 30-34 ఏళ్ల కేటగిరీలో విపిన్ పాల్గొన్నాడు. 3.8 కిలోమీటర్ల ఈత, 180 కిమీ సైక్లింగ్, 42.2 కిలోమీటర్ల పరుగును 11 గంటల 55 నిమిషాల్లో పూర్తి చేసి సత్తాచాటాడు. ఈ వయస్సు కాటగిరిలో భారత్‌లో తొలి ట్రయాథ్లాన్‌గా నిలిచాడు.

కనువిందు.. కొండగుడి పండగ

- వేడుకగా మేరీమాత ఊరేగింపు
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు
- ముగిసిన ఉత్సవాలు



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



శిలువతో ప్రదర్శన నిర్వహిస్తున్న పాస్టర్లు

డాబాగార్డెన్స్: క్రీస్తుకు జన్మనిచ్చి, ప్రపంచాన్ని పునీతం చేసిన మేరీమాతను కనులారా చూడాలని, మాత కరుణ కటాక్షాలు తమపై ప్రసరించాలని భక్తులు పరితపించారు. దూరాభారం లెక్క చేయకుండా వేలాదిగా తరలివచ్చారు. గంటల కొద్దీ నిరీక్షించి కొండగుడి ఉత్సవాన్ని కనులారా తిలకించి భక్తి తన్మయత్వంలో మునిగిపోయారు. పాత పోస్టాఫీస్ ప్రాంతంలోని రోస్‌హిల్ కొండపై వెలసిన అమలోద్భవిని దర్శించుకోవడానికి అశేష భక్తజనం తరలివచ్చింది. భక్తి పారవశ్యంతో మాతను స్మరిస్తూ.. ఆరాధకుల గీతాలాపనలు.. సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం అగ్ర పీఠాధిపతుల బోధనలు, ఇలా అక్కడ అణువణువునా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణ జిల్లాల నుంచి అమ్మ కరుణ కోసం తరలి వచ్చిన ఆరాధకులతో విశాఖ జనపురిగా మారిపోయింది. కుల, మతాలకు అతీతంగా అమ్మవారిని దర్శించుకోవడంతో పరమత సహనం పరిఢవిల్లింది. గత నెల 29న ప్రారంభమైన మేరీమాత ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పది రోజుల పాటు నవ దిన ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 4.30, 5.15, 6 గంటలకు దేవాలయం వద్ద ఆంగ్లంలో దివ్యపూజ చేశారు. తెలుగులో ఉదయం 5, 6 గంటలకు దివ్య పూజ జరిపారు. పూజలో ఎక్కువ మంది కన్యస్త్రీలు రాష్ట్రం నలుమూలల నుంచి హాజరై ప్రార్థనలు చేశారు. ఉదయం 7.30 గంటలకు గుహవద్ద విశాఖ అగ్రపీఠాధిపతి ఫాదర్ మల్లవరపు ప్రకాష్ సమష్టి దివ్యబలి పూజ ప్రసంగమిచ్చారు. 350 మంది వలంటీర్లు, 50 మంది గురువులతో పాటు నగరంలోని వివిధ చర్చిల ఫాదర్లు ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం పాతపోస్టాఫీస్ వద్ద ఉన్న సెయింట్ అలెయిసిస్ పాఠశాల నుంచి అశేష ఆరాధకులు మేరిమాత స్వరూపంతో ప్రదక్షిణగా కొండపై ఉన్న ప్రధాన దేవాలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. ఆరాధకుల సందర్శనార్థం ఆలయం బయట అమలోద్భవి స్వరూపాన్ని ఉంచారు. ఆరాధకులు అమ్మవారికి తమ శక్తి మేరకు బంగారం, వెండి కానుకలు సమర్పించారు. కొంత మంది తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. లూర్దుమాత గుహ వద్ద దివ్యపూజ బలితో మహోత్సవం ముగిసింది.

జోరుగా వ్యాపారం

పాత పోస్టాఫీసు, కోటవీధి, ఫెర్రీరోడ్డు, అంబుసరంగ్ వీధి, కన్వేయర బెల్ట్ తదితర ప్రాంతాల్లో పండగ సందర్భంగా సుమారు కిలోమీటర్ల మేర దుకాణాలు వెలిశాయి. ఆధ్యాత్మిక గ్రంథాలు, కొండగుడి చరిత్ర, ఏసుక్రీస్తు, మేరిమాత బొమ్మలు కొలువుదీరాయి. మిఠాయిలు, శనగలు, ఖర్జూరం వ్యాపారం జోరుగా సాగింది. కొవ్వొత్తుల వ్యాపారం ఎక్కువగా జరిగింది.

తమ్ముళ్ల 'భరోసా'కు స్పందన కరవు

- హార్బర్‌లో అగ్ని ప్రమాద బాధితులకు టీడీపీ సాయం
- జిల్లా నాయకులు చందాలు వేసుకొని మత్స్యకారులకు అందజేత
- గంగపుత్రులు ముఖం చాటేయడంతో పార్టీలో చర్చ

మహారాణిపేట: టీడీపీ 'మత్స్యకార భరోసా'కు స్పందన కరువైంది. మత్స్యకారులను ఆర్థిక సాయం పేరుతో ఎత్తున కార్యక్రమం నిర్వహించాలనుకున్న తెలుగు తమ్ముళ్లకు గంగపుత్రులు జలక్ ఇచ్చారు. హార్బర్‌లో అగ్ని ప్రమాద ఘటన జరిగిన మూడు వారాల తరువాత టీడీపీ నేతలు మేలుకున్నారు. శుక్రవారం ఫిషింగ్ హార్బర్‌లో బోట్ల యాజమానులు, కలాసీలకు ఆర్థిక సాయం అందించేందుకు జిల్లా టీడీపీ నేతలు భారీ ఏర్పాట్లు చేశారు. బాధితులు మినహా మిగిలిన వారెవరూ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు.

ఎంతో అట్టహాసంగా జరుగుతుందనుకున్న మత్స్యకార భరోసా కార్యక్రమం అట్టర్‌ఫ్లాప్ అవడంతో తెలుగు తమ్ముళ్లు కంగుతిన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జరిగిన ఈ పరిణామంతో టీడీపీ శ్రేణులు డీలాపడ్డాయి.

మూడు వారాల తరువాత పరామర్శా?

హార్బర్‌లో జరిగిన ప్రమాదాన్ని ప్రభుత్వ వైఫల్యంగా చూపించేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీలు విశ్వ ప్రయత్నాలు చేశాయి. ఘటన జరిగిన 5 రోజుల్లో బాధితులకు ప్రభుత్వం బోటు ధరలో 80 శాతం చెల్లించడంతో ప్రతిపక్షాలు నోరెత్తలేకపోయాయి. టీడీపీ హయాంలో హుద్‌హుద్, తిత్లీ తుపాను సమయాల్లో నష్టపోయిన బాధితులకు ఏళ్లు గడిచినా పరిహారం అందించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రమాదం జరిగిన వారం రోజుల లోపే పరిహారం అందించడంతో ప్రతిపక్షాలకు మింగుడుపడలేదు. ఇప్పటికైనా మత్స్యకారులకు పార్టీ తరపున సాయం అందించకపోతే వచ్చే ఎన్నికల్లో ఆ ప్రభావం పడే అవకాశముందని స్థానిక నేతల్లో భయాందోళన నెలకొంది. టీడీపీ అధినాయకులు చంద్రబాబు, లోకేష్‌ల నుంచి స్పందన లేకపోవడంతో జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు చందాలు ఎత్తుకున్నారు. పూర్తిగా దగ్ధమైన బోటు యజమానులకు రూ.లక్ష, పాక్షికంగా దెబ్బతిన్న బోటు యజమానులకు రూ.50 వేలు, కలాసీలకు రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, బండారు సత్యనారాయణమూర్తి, ఇతర నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మత్స్యకారులు ఎక్కువగా సంచరించే గాంధీ బొమ్మ ఏరియాలో జరిగిన ఈ కార్యక్రమానికి స్పందన లేకపోవడంపై టీడీపీలో చర్చనీయాంశంగా మారింది.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- రాంపురం వద్ద ఆర్టీసీ బస్సు, లారీ ఢీ
- అదృష్టవశాత్తు సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు



పెందుర్తి మండలం రాంపురం వద్ద బైపాస్‌పై ఢీకొన్న ఆర్టీసీ బస్సు, లారీ

పెందుర్తి: మండలంలోని రాంపురం వద్ద శుక్రవారం పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఆనందపురం-అనకాపల్లి బైపాస్‌పై ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. అదృష్టవశాత్తు ఇద్దరు డ్రైవర్లు చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలస వైపు నుంచి పరవాడకు బొగ్గు లోడుతో లారీ వెళ్తుంది. ఈ లారీ రాంపురం బైపాస్ వంతెన వద్దకు వచ్చేసరికి అదే సమయంలో దేవరాపల్లి నుంచి సింధియాకు వెళ్తున్న రూట్ నంబర్ 55డీ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సులోని ప్రయాణికులు కుదుపునకు గురయ్యారు. డ్రైవర్లు చాకచక్యంగా వ్యవహరించి వాహనాలను నియంత్రించారు. దీంతో ఆర్టీసీ బస్సులోని దాదాపు 80 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. దేవరాపల్లికి చెందిన రామయమ్మ అనే మహిళకు చేతి వేలిపై చిన్నపాటి గాయమైంది. సమాచారం అందుకున్న వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ కె.అశోక్‌కుమార్, పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ జి.రమేష్ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉద్యమ స్ఫూర్తితో 'ఉక్కు సత్యాగ్రహం' చిత్రం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యమ స్ఫూర్తితో ఉక్కు సత్యాగ్రహం చిత్రం నిర్మించామని దర్శకుడు, నిర్మాత, నటుడు పీపుల్ స్టార్ సత్యారెడ్డి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ కొవ్వొత్తుల జంక్షన్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్ర యూనిట్ సినిమా విశేషాలను ఉద్యోగులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ ప్రజాకవి గద్దర్ సూచన మేరకు ఈ చిత్రాన్ని నిర్మించామన్నారు. ఇదే ఆయన ఆఖరి చిత్రం కావడం బాధాకరమన్నారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, తదితరులు ఈ చిత్రంలో నటించారని, గద్దర్ నాలుగు పాటలు రచించి ఉద్యమ స్ఫూర్తిని నింపారని వివరించారు. ఈ నెల 13న ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహిస్తామని, 15న సినిమాను విడుదల చేస్తామన్నారు. నటి పల్సర్ బైక్ ఝాన్సీ మాట్లాడుతూ 32 మంది అమరవీరుల స్ఫూర్తి చిత్ర నిర్మాణంలో ప్రధాన భూమిక వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, వై.మస్తానప్ప, కారు రమణ, సురేష్ బాబు, వరసాల శ్రీనివాస్, నమ్మి సింహాద్రి, సన్యాసిరావు, పరంధామయ్య పాల్గొన్నారు.

పీఎఫ్ పెన్షనర్లు.. రోడ్డుపైనే నిరీక్షణ!

విశాఖ విద్య: ప్రావిడెంట్ ఫండ్ రీజినల్ కార్యాలయంలో సరైన సదుపాయాలు లేక లబ్ధిదారులు రోడ్డుపైనే నిరీక్షించాల్సి వస్తోంది. విశాఖలోని మద్దిపాలెం వుడా లేఅవుట్‌లో ఉన్న పీఎఫ్ కార్యాలయానికి ఉమ్మడి విశాఖ జిల్లాలోని గ్రామాల నుంచి పలు పనుల నిమిత్తం వస్తుంటారు. 2024 సంవత్సరానికి పింఛన్ పొందేందుకు బయోమెట్రిక్ విధానంలో ఈ నెలాఖరులోగా ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంది. దీంతో ప్రస్తుతం రోజూ అధిక సంఖ్యలో పింఛన్‌దారులు ఇక్కడికి వస్తున్నారు. వాస్తవంగా అయితే బయోమెట్రిక్ ధ్రువీకరణ గ్రామాల్లో ఉన్న ఆన్‌లైన్ సెంటర్లలో కూడా చేసుకునే అవకాశం ఉంది. కానీ దీనిపై అవగాహన లేక పింఛన్‌దారులు నగరంలోని పీఎఫ్ కార్యాలయానికి వస్తున్నారు. ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో కార్యాలయం ముందు రోడ్డుపైనే గంటల తరబడి వేచి ఉంటున్నారు. ఇక్కడ సమీపంలో ఉన్న నెట్ సెంటర్ల నిర్వాహకులు ఇదే అదునుగా పింఛన్‌దారులను పిలిచి, తమ వద్ద ధ్రువీకరణ చేయించుకోవచ్చని డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ పని గ్రామాల్లోనే చేసుకునే అవకాశం ఉన్నందున, అధికారులు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తే బాగుండేదని పలువురు పెన్షనర్లు అభిప్రాయపడుతున్నారు.



పీఎఫ్ కార్యాలయం ఎదుట డివైడర్‌పై వేచి ఉన్న లబ్ధిదారులు

జగన్ మళ్లీ సీఎం కావాలని ఆటోపై యాత్ర



ఆటో యాత్ర చేస్తున్న జయకుమార్

భీమునిపట్నం: అతను ఓ పెయింటర్, భార్య వ్యవసాయ కూలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అంటే ఎనలేని ప్రేమ, అభిమానం. పేదలకు సంక్షేమానికి చరిత్రలో ఎవరూ చేయనంతగా సేవలందిస్తున్న జగన్ మళ్లీ సీఎం కావాలని పరితపిస్తున్న వ్యక్తి. జగన్ మళ్లీ సీఎం కావాలంటూ ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడి గ్రామానికి చెందిన కావూరి జయకుమార్ వంద రోజులుగా ఆటోలో ప్రజా సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నాడు. ఈ యాత్ర శుక్రవారం భీమిలి చేరుకుంది. సీఎం జగన్ పాలనలో పేదలు, నిరుపేదలు, వెనుకబడిన తరగతులకు వారికి అందుతున్న మేలు చూసి ముగ్ధుడయ్యాడు. ఇంతటి గొప్ప ముఖ్యమంత్రి ఒకసారి కాదు మళ్లీ, మళ్లీ ఆయనే ఉండాలన్న ఉద్దేశంతో వందరోజుల పాటు ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్ నుంచి ఇచ్ఛాపురంలో జగన్ సంకల్ప యాత్ర పూర్తి చేసిన విజయ స్తూపం వరకు ఆటోలో పర్యటిస్తున్నాడు. భీమిలి నియోజకవర్గంలో నాలుగు రోజులపాటు యాత్ర సాగిస్తున్నాడు. చేతిలో పెద్దగా డబ్బులు లేకపోయినా యాత్రను సెప్టెంబర్ 12న ప్రారంభించాడు. దీనికి ఆయన భార్య సునీత కూడా ఎంతో సానుకూలంగా స్పందించి తిలకం దిద్ది పంపింది. డిసెంబర్ 21న సీఎం జగన్ జన్మదినం సందర్భంగా యాత్ర పూర్తి చేయాలని భావిస్తున్నాడు. కేవలం ఆటోలో వెళ్లిపోవడం కాకుండా ఆటో చుట్టు సీఎం జగన్ కటౌట్‌లను ఏర్పాటు చేసుకుని ఆయా ప్రాంతాల్లో ఆగుతూ ప్రజలకు జగన్ పాలన గొప్పదనాన్ని వివరిస్తున్నాడు.

ప్రజలు మెచ్చిన నాయకుడు : జయకుమార్

చేస్తున్న యాత్ర శుక్రవారం భీమిలి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రజలతో ఆయన మాట్లాడారు. పేద వర్గాల ప్రజలకు ఇంత అద్భుతమైన పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనేనని తెలిపారు. ఆయనను మళ్లీ సీఎంగా గెలిపించుకోవలసిన బాధ్యత, అవసరం అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఇతర నాయకులను కలిశారు.

సీఎం జగన్‌తో ఫొటో తీసుకోవాలని కోరిక..

పేదలకు సేవ చేస్తున్న సీఎం జగన్‌తో ఒక్క ఫొటో తీసుకోవాలన్నదే తన కోరిక అని జయకుమార్ తెలిపారు. దళారులు బెడద లేకుండా ఎక్కడ అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకు అందడం అపూర్వమైన విషయమన్నారు. సాధారణ పెయింటర్ వృత్తిలో ఉండి జగన్‌పై అమితమై ప్రేమతో ఇలా యాత్ర చేస్తున్న జయకుమార్ ప్రతి చోట ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది.

డీఈఐలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: విశాలాక్షినగర్ దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్(డీఈఐ)లో పలు కోర్సుల్లో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. టై అండ్ డై(9 వారాలు) కోర్సు కోసం 8వ తరగతి ఉత్తీర్ణత కలిగిన మహిళలు, పురుషులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్ కోర్సు(ఒక సంవత్సరం)కు పదో తరగతి చదివిన స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్(ఒక సంవత్సరం) కోసం పదో తరగతి ఉత్తీర్ణలైన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మోటార్ వెహికల్ ఫోర్ వీలర్ మెకానిక్(ఒక సంవత్సరం) కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన పురుషులు అర్హులన్నారు. ఆఫీస్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్(ఒక సంవత్సరం) కోసం ఇంటర్ ఉత్తీర్ణులైన మహిళలు, పురుషులు అర్హులన్నారు. కటింగ్ అండ్ సూయింగ్(ఒక సంవత్సరం) కోసం 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలను. మరిన్ని వివరాల కోసం 9963340611 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి క్యారమ్ పోటీలు



మాట్లాడుతున్న డాక్టర్ నీరజ్‌కుమార్

విశాఖ విద్య: విశాఖలోని గీతం కాలేజీ కేఆర్‌ఎం ఇండోర్ స్టేడియంలో ఈ నెల 10 నుంచి జాతీయ స్థాయి క్యారమ్ పోటీలు నిర్వహించనున్నట్టు ఆల్ ఇండియా క్యారమ్ ఫెడరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి తెలిపారు. శుక్రవారం వుడా కాలనీ శివ శివానీ స్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 4 రోజుల పాటు జరిగే టోర్నమెంట్‌కు వివిధ రాష్ట్రాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని, వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. టోర్నమెంట్ ఫార్మాట్‌లో స్త్రీ, పురుషుల సింగిల్స్, డబుల్స్ నాకౌట్ మ్యాచ్‌లు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఏఎస్ సీఏ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జలీల్ ఫోన్ నంబర్ 9951115678లో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఆంధ్ర స్టేట్ క్యారమ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ జలీల్, కోశాధికారి ఎ.ఆదినారాయణరెడ్డి, డాక్టర్ ప్రీతి సంపత్తి, భారతీ నారాయణ్, ఎస్.మదన్ రాజ్, టి.ప్రవీణ్‌కుమార్, డి.వి.ఎస్.వై.శర్మ పాల్గొన్నారు.

ఘనంగా కేకే రాజు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు



కేకే రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ హరివెంకటకుమారి

సీతమ్మధార : నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మంత్రి గుడివాడ అమరనాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మంత్రి అమర్‌నాథ్ కేక్ కట్ చేసి కేకే రాజుకు తినిపించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేకే రాజు ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, సురేష్‌రాజు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, చైర్మన్లు, డైరెక్టర్లు, పలు శాఖ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనానికి అంతా సిద్ధం

- నేడు ఏయూ పూర్వవిద్యార్థుల సమావేశం
- ముఖ్య అతిథిగా టాటాసన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్



నటరాజన్ చంద్రశేఖరన్

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల సంఘం వార్షిక సమావేశం శనివారం జరగనుంది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్‌సెంటర్ వేదికగా నిర్వహించే వేవ్స్ 2023 వేడుకకు ముఖ్య అతిథిగా టాటాసన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ హాజరుకానున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకుకార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమాన్ని ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్, జీఎంఆర్ గ్రూప్ సంస్థల చైర్మన్ జి.ఎం రావు అధ్యక్షత వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి సమావేశం ప్రారంభం అవుతుంది. ముందుగా ఏయూ పరిపాలనా భవనం వద్దకు నటరాజన్ చేరుకుని ఏయూ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాలలవు వేస్తారు. అనంతరం ఆ హబ్, నాస్ కామ్ సెంటర్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను సందర్శిస్తారు. అక్కడ నుంచి పూర్వవిద్యార్థుల సంఘం కార్యాలయానికి చేరుకుని ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులతో కొద్దిసేపు గడుపుతారు. అనంతరం బీచ్‌రోడ్డులో జరిగే వేవ్స్ 2023 సమావేశంలో పాల్గొంటారు. సమావేశంలో భాగంగా ఉదయం ప్రతీ విభాగంలోను పూర్వవిద్యార్థుల సమావేశాలు నిర్వహిస్తారు. విభాగాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ విభాగాలకు వెళ్లి గడుపుతారు. కార్యక్రమంలో ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులతోపాటు దాదాపు రెండు వేల మందికిపైగా పూర్వవిద్యార్థులు, ఏయూ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు, అతిథులు, ఆహ్వానితులు పాల్గొంటారు.

ఘనంగా జలాంతర్గామి దినోత్సవం

సింధియా: భారత నావికాదళం జలాంతర్గామి విభాగం ఏర్పడిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ 56వ జలాంతర్గామి దినోత్సవాన్ని (సబ్‌మెరైన్ డే) శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ హాజరై సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఫ్లాగ్ ఆఫీసర్, సబ్‌మెరైన్స్ రియర్ అడ్మిరల్ ఎం.కె.వెంకట్రామన్ సబ్‌మెరైన్ సెనోటాఫ్ ఐఎన్‌ఎస్ వీరబాహు వద్ద శాశ్వత గస్తీ పేరుతో విధి నిర్వహణలో దేశానికి అత్యున్నత త్యాగం చేసిన జలాంతర్గాములకు సెల్యూట్ చేశారు.



ఐఎన్ఎస్ వీరబాహు వద్ద సెల్యూట్ చేస్తున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

నేడు కేంద్ర రైల్వే శాఖ మంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ శనివారం విశాఖ రానున్నారు. ఉదయం 8.05 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి సింహాచలం శ్రీవరాహ లక్ష్మి నరసింహ స్వామి దర్శనం అనంతరం ఉదయం 9.20 గంటలకు సింహాచలం రైల్వే స్టేషన్‌ను సందర్శించి అక్కడ సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం 10.20 గంటలకు విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తికి చేరుకుంటారు. తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. 3.30 నుంచి 4.45 గంటల వరకు విశాలక్షినగర్‌లో జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొని సాయంత్రం 5.55 గంటలకు విమానంలో ఢిల్లీ వెళ్తారు.